
సాక్షి
బాపట్ల
మంగళవారం । 24 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.9635 టీఎంసీలు. ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 2216 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. పలు కాల్వలకు 1920 క్యూసెక్కులు వదిలారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

బౌద్ధస్థూపానికి ఆదరణ కరువు

- నిలిచిన పునర్నిర్మాణ పనులు
- ముందుకు సాగని బుద్ధుని విగ్రహం, బోటు షికారు పనులు

భట్టిప్రోలు: భారతదేశంలో అత్యంత ప్రాచీన స్థలాల్లో ఒకటైన భట్టిప్రోలు బౌద్ధస్థూపం ఏళ్ల తరబడి నిరాదరణకు గురవుతూనే ఉంది. దాదాపు 3 వేల సంవత్సరాల కిందట భట్టిప్రోలు వాణిజ్య, విద్యా కేంద్రంగా విరాజిల్లింది. ఇక్కడ బుద్ధుని అస్థికలపై కట్టిన స్మారక స్థూపమే భట్టిప్రోలు మహాస్థూపం. రాష్ట్రంలోని అన్ని స్థూపాల్లో కెల్లా ఇది అతి పురాతనమైనది. క్రీ.పూ 500 సంవత్సరాల కిందట భట్టిప్రోలు ప్రతీపాలపురం అనే పేరుతో ఏర్పడింది. ఇక్ష్వాకులరాజు అయిన యశోదరుడు ఈ నగరాన్ని స్థాపించాడు. 1870లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన బాస్వెల్ కృషితో భట్టిప్రోలు చరిత్ర తిరిగి వెలుగులోకి వచ్చింది. 1871లో వాల్టర్ విలియట్ 1874లో నారీస్, 1882లో రాబర్ట్ సీవెల్, 1892 అలెగ్జాండర్ 1894లో బుల్హర్, 1970లో డాక్టర్ ఆర్ సుబ్రహ్మణ్యంలు జరిపిన తవ్వకాల వల్ల భట్టిప్రోలు చరిత్ర ఆధునిక ప్రపంచానికి తెలిసింది.

మౌలిక వసతులు మృగ్యం

బౌద్ధస్థూపం అభివృద్ధి పనులు ఎలా ఉన్నా దీనిని వీక్షించేందుకు వస్తున్న పర్యాటకులకు కనీస సౌకర్యాలు కూడా లేవు. స్థూపం ముందు భాగంలో గార్డెనింగ్‌పై దృష్టి సారించిన పురావస్తు, ఆర్కియాలజీ శాఖాధికారులు వసతుల కల్పన విషయాన్ని విస్మరించారు. ఇంత వరకు బౌద్ధ స్థూపం చుట్టూ అండర్ పోర్షన్ మాత్రమే పూర్తయింది.

భాష ప్రాచీనతకు ఆధారం

తెలుగు భాషకు ప్రాచీన భాష హోదా పొందే అన్ని అర్హతలు ఉన్నాయని 2015లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మద్రాసు హైకోర్టుకు విన్నవించింది. అప్పటి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ప్రభుత్వం తరఫున న్యాయస్థానానికి ప్రతివ్యాజ్యం సమర్పిస్తూ సంస్కృతం, తమిళ భాషలతో సమానంగా తెలుగు భాషకు ప్రాచీన చరిత్ర ఉందని పేర్కొన్నారు. భట్టిప్రోలులోని పురాతన తెలుగు శాసనం భాష ప్రాచీనత్వానికి ఆధారమని తెలిపారు.



భట్టిప్రోలులోని బౌద్ధస్థూపం



పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బౌద్ధస్థూపం బయట వేసిన శిలా ఫలకం

శిలాఫలకానికే పరిమితమైన అభివృద్ధి పనులు

బుద్ధ పౌర్ణమిని గత రాష్ట్ర ప్రభుత్వం అధికారక పూర్వకంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 2016 మే 19న శ్రీకారం చుట్టింది. బౌద్ధ స్థూపం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (జేతవనం ప్రాజెక్ట్) ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో బౌద్ధ స్థూపం పరిధిలో చేపట్టనున్న 40 అడుగుల బుద్ధుని విగ్రహం, బోటు షికారు, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకం అలానే ఉంది. పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నాడు ఈ శిలాఫలకాన్ని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆవిష్కరించారు. అప్పట్లో బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేసేందుకు పక్కనే ఉన్న చెరువు వెనుభాగంలో ప్లాట్‌ఫామ్ నిర్మించారు. ఆ తరువాత పనులు ముందుకు కదల లేదు.

ప్లానిటోరియం ఏర్పాటు చేయాలి



విజయవాడ గాంధీ హిల్స్‌పై ప్లానిటోరియం ఉంది. అలానే భట్టిప్రోలులో కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. బౌద్ధ స్థూపంను తిలకించడంతోపాటు ప్లానిటోరియంను కూడా అధిక సంఖ్యలో ప్రజలు వీక్షించే అవకాశం ఉంది.

–పీజే అరుణ్‌శాస్త్రి–వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి

మౌలిక వసతులు లేక ఇక్కట్లు



బౌద్ధస్థూపం ఆవరణలో మౌలిక వసతులు లేవు. కూర్చొనేందుకు బల్లలు లేవు. కింద గడ్డిలో కూర్చొవాలంటే పురుగులు ఉంటున్నాయి. కనీసం తాగేందుకు నీటి సదుపాయం కూడా లేదు. కనీస సౌకర్యాలు లేక పర్యాటకులు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు.

–బొలిశెట్టి శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు

బౌద్ధస్థూపం అభివృద్ధికి చర్యలు



చరిత్ర ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు బౌద్ధస్థూపం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖను కోరాం. త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ మేరుగ నాగార్జున, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

న్యూస్‌రీల్

నేడు ఎయిమ్స్ ఐదో వార్షికోత్సవం

మంగళగిరి: నగర పరిధిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఐదో వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఆసుపత్రి ఆవరణలోని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కె.జవహర్ రెడ్డి, అతిథులుగా డాక్టర్ వేమూరి మూర్తితో పాటు పలువురు అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

రిపబ్లిక్ డే వేడుకలకు విజ్ఞాన్ విద్యార్థులు



కేశవ్‌కుమార్ రాయ్



మహ్మద్ షమా పర్వీన్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఇరువురు విద్యార్థులు న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ వేడుకలు వీక్షించేందుకు ఎంపికయ్యారని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కార్యాలయం సోమవారం తెలియజేసింది. దేశంలోని అన్ని యూనివర్సిటీల్లో మంచి ప్రతిభ చూపిన 50 మంది విద్యార్థులకు దేశ ప్రధానమంత్రితో కలిసి రిపబ్లిక్ డే వేడుకలను కర్తవ్యపథ్‌లోని ప్రధానమంత్రి బాక్స్ నుంచి చూసే అవకాశం ఉంటుంది. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీకు చెందిన కేశవ్ కుమార్ రాయ్ (బీటెక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ 9.87 సీజీపీఏతో గోల్డ్ మెడల్), మహ్మద్ షమా పర్వీన్ (ఎంటెక్‌లోని అన్ని బ్రాంచ్‌లలో కెల్లా ఉత్తమ సీజీపీఏతో గోల్డ్ మెడల్)లు మాత్రమే ఉన్నారని తెలియజేసింది. రిపబ్లిక్ డే వేడుకలను వీక్షించేందుకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

11న నవోదయ ప్రవేశ పరీక్ష

చిలకలూరిపేటటౌన్: నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారు హాల్ టికెట్లు నవోదయ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11తేదీ నిర్వహిస్తున్నట్లు, హాల్‌టికెట్లను రిజిస్ట్రేషన్ నంబర్ లేదా పుట్టినతేదీ ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సాంకేతిక కారణాలతో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ కానివారు నేరుగా మండలంలోని మద్దిరాల నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని కోరారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 31తేదీ చివరి తేదీ అని, ఈ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గుర్తు చేశారు.

జగనన్న గృహాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్

గుంటూరు ఈస్ట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గృహనిర్మాణ పథకంలో భాగంగా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇస్తున్నట్లు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ మురళీకృష్ణ యాదవ్ సోమవారం ఒప్రకటనలో తెలిపారు. ఒక కిలోవాట్ విద్యుత్ వరకు కనెక్షన్ ఉచితంగా ఇస్తున్నామన్నారు. దీనికి లబ్ధిదారులు వారి హౌస్ ఎలాంట్‌మెంట్ లెటర్, ఆధార్ జిరాక్స్ కాపీ, ఫొటోలు దరఖాస్తుతో జత చేయాలన్నారు. సంబంధిత ఏఈ కార్యాలయాల్లో సంప్రదించి ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కొందరు లబ్ధిదారులు తెలియక సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో రుసుము చెల్లిస్తున్నారని, చెల్లించాల్సిన అవసరం లేదని వివరించారు. లబ్ధిదారులకు సర్వీసు వైరు, మీటరు బోర్డు, ఎస్‌సీసీబీ, ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. వినియోగదారులు ఈసౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జోరుగా మిర్చి క్రయవిక్రయాలు

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఈ సీజన్‌లో ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా సోమవారం రైతులు 1,07,429 బస్తాలు యార్డుకు తరలించారు. ఈ–నామ్ ద్వారా 98,686 బస్తాలు విక్రయాలు జరిగాయి. మిర్చి ధరలు ప్రస్తుతం స్థిరంగా ఉండటంతో రైతులు అమ్మకాలకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్త సరుకు యార్డుకు ఇప్పుడిప్పుడే వస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు కర్నూలు, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి వచ్చే మిర్చి అంత నాణ్యతగా ఉండటం లేదు. తాలు ఎక్కువగా వస్తుంది. అందుకే రైతులు నిల్వ పెట్టడం కంటే అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. మరీ తడిగా ఉన్న మిర్చిని యార్డుకు తీసుకువస్తున్నారని, ఫలితంగా ధరలపై ప్రభావం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: గణతంత్ర దినోత్సవాన్ని బాపట్ల జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. 74వ గణతంత్ర దినోత్సవంపై జిల్లా అధికారులతో సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలిసారిగా వేడుకలు నిర్వహించడం అధికారులు అదృష్టంగా భావించాలని అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. పోలీసు కవాతు మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా ప్రగతిని చాటిచెప్పేలా శకటాల ప్రదర్శన ఉండాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా స్టాల్స్ ప్రదర్శన ఉండాలన్నారు. జాతీయభావాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడమే ముఖ్యమన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండుగగా నిర్వహించాలన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు విధిగా పాల్గొనాలని అన్నారు. ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు ఇచ్చేలా జాబితా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, డీఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు వెంటనే పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్
- స్పందనలో అర్జీల స్వీకారం

బాపట్లఅర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ నుంచి ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ స్పందన అర్జీల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి పదే పదే వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో స్పందన కార్యక్రమంలో పదే పదే వచ్చే అర్జీలను మండల స్థాయి అధికారులు సంబంధిత సచివాలయ సిబ్బందితో విచారణ జరిపి రేపు సాయంత్రంలోగా కలెక్టరేట్‌కు నివేదికను అందజేయాలన్నారు. అర్జీలను సూక్ష్మస్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి అనుకూలంగా ఉన్నవి, పరిష్కరించడానికి వీలు పడదని వాటిని సరైన కారణాలతో నివేదికలు ఇవ్వాలని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నూటికి నూరు శాతం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీనాగజ్యోతి, సీపీఓ భరత్‌కుమార్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

నా భూమిని ఆక్రమించుకున్నారు

నాకు బాపట్ల హనుమంతరావు కాలనీలో సర్వే నంబర్ 981–3ఏలో 45 సెంట్ల భూమి ఉంది. ఆ భూమిని చీలంకురి సుధాకర్‌బాబు ఆక్రమించుకున్నాడు. అతనిపై చర్యలు తీసుకొని నా భూమిని నాకు ఇప్పించండి.

– కారుమూరి వెంకాయమ్మ,బాపట్ల

పేర్లిపై చర్య తీసుకోండి

నివేశన స్థలాలు ఇప్పించండి. 35 సంవత్సరాలుగా బాపట్లకు చెందిన పరిశ్రమల కేంద్రంలో 125 కుటుంబాలకు చెందిన వారం జీవనం సాగిస్తున్నాం. పేర్లీ మోహన్‌రావు మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. అతనిపై చర్యలు తీసుకుని ఆ భూమిని పేదలమైన మాకు ఇప్పించాలి.

– రాజీవ్‌నగర్ కాలనీ వాసులు, బాపట్ల

ఆక్రమణకు యత్నం

మాకు 1992లో ప్రభుత్వం సాగు చేసుకోవడానికి 40 ఎకరాల భూమిని ఇచ్చింది. అప్పటి నుంచి భూమిని సాగు చేసుకుంటున్నాం. ఇప్పుడు స్వాములు, ఏలూరు శ్రీనివాసరావులు మమ్మల్ని బెదిరించి మా భూములు లాక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. వారి మీద చర్యలు తీసుకొని మా భూములు సాగు చేసుకునేందుకు వీలు కల్పించాలి.

– మోటుపల్లి గ్రామస్తులు, చిన్నగంజాం మండలం

వృద్ధాప్య పింఛను ఇప్పించండి

నాకు వృద్ధాప్య పింఛను ఇప్పించండి. సరైన ఆదాయం లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాను.

–ఇమామ్, బాపట్ల బేతనీకాలనీ

విజేఈఈ భవ!

ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ చదవాలనే విద్యార్థుల కలకు తొలిమెట్టు మొదలు కానుంది. దేశంలోనే ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీలలో ప్రవేశ పరీక్షల అంకం నేటినుంచి మొదలుకానుంది. ఆన్‌లైన్‌లో రెండు సెషన్లుగా జరిగే జేఈఈ మెయిన్ పరీక్షకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాలను ఎన్‌టీఏ సిద్ధం చేసింది.

- నేటి నుంచి జేఈఈ మెయిన్
- ఈనెల 24, 25, 28, 29, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీ వరకు నిర్వహణ
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో ఆన్‌లైన్ సెషన్లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 9,500 మంది విద్యార్థులు



గతేడాది జేఈఈ మెయిన్‌కు హాజరవుతున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశానికై నిర్వహించే జేఈఈ మెయిన్ మొదటి సెషన్ పరీక్షలు మంగళవారం నుంచి జరగనున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పేపర్–1, పేపర్–2 విధానంలో జరగనున్న బీఈ, బీటెక్, బీఆర్క్, ప్లానింగ్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా దరకాస్తు చేసిన 9,500 మంది విద్యార్థులకు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరగనున్న ఆన్‌లైన్ పరీక్షలకు సంబంధించిన మార్గదర్శకాలను విద్యార్థులకు అడ్మిట్‌కార్డుతో పాటు అందజేసిన ఇన్ఫర్మేషన్ బుక్‌లెట్‌లో పొందుపర్చారు. ఈనెల 24, 25, 28, 29, 30, 31తో పాటు ఫిబ్రవరి 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నం..

ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించే లక్ష్యంతో విద్యా సంవత్సరం పొడవునా సన్నద్ధమవుతున్న విద్యార్థులు పరీక్షలు జరిగే రోజున ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది.

- జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణలో ఎన్‌టీఏ విధించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సి ఉంది.
- ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పేపర్–1 పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులను ఉదయం 7 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. తదుపరి ఉదయం 8.30 గంటలకు విద్యార్థులను అనుమతించడం నిలిపివేస్తారు.
- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనున్న పేపర్–2 పరీక్షకు విద్యార్థులను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకే అనుమతిస్తారు. పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని తప్పక తెలుసుకోవాలి.
- పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లిన తరువాత ఆన్‌లైన్ పరీక్షకు సంబంధించి ఇన్విజిలేటర్లు అందించే సూచనలతో పాటు నియమ, నిబంధనలు తెలుసుకునేందుకు అరగంట సమయాన్ని కేటాయించిన కారణంగా విద్యార్థులను పరీక్షా సమయానికి అరగంట ముందు వరకే అనుమతించాలని ఎన్‌టీఏ మార్గదర్శకాల్లో పొందుపర్చింది. ఉదయం 9.00, మధ్యాహ్నం 3 గంటలకు ఖచ్చితంగా పరీక్ష ప్రారంభమవుతుంది.

వేగం కన్నా ప్రాణం మిన్న

పల్నాడు కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: రహదారి భద్రతా నియమాలను పాటించటం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో సోమవారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం ముఖ్యమనే విషయం వాహనదారులు గుర్తుంచుకోవాలన్నారు. మితిమీరిన వేగంతో ఎందరో ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సదస్సుకు హాజరైన డ్రైవర్లకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రారంభించారు. డ్రైవర్లకు డాక్టర్ గోపిరెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించి తగిన సూచనలు అందించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తా మని డ్రైవర్లచే ప్రమాణం చేయించారు. ఇప్పటివరకు ప్రమాదాలు లేకుండా వాహనాలను నడిపిన ఆరుగురు డ్రైవర్లను సత్కరించారు. ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.శివనాగేశ్వరరావు, బి.సత్యనారాయణప్రసాద్, ఎస్.శ్రావ్య ఉన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తదితరులు

జీఎన్ఎం పరీక్షలు ప్రారంభం



గుంటూరు మెడికల్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) నర్సింగ్ వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు వైద్య కళాశాలలో జిల్లావ్యాప్తంగా పలు నర్సింగ్ పాఠశాలలకు చెందిన 1474 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. తొలిరోజు పరీక్షకు 1330 మంది హాజరు కాగా, 144 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల చీఫ్ ఎగ్జామినర్‌గా గుంటూరు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, అబ్జర్వర్‌గా అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌లు వ్యవహరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఫిబ్రవరి 1 వ తేదీ వరకు థియరీ పరీక్షలు, ఫిబ్రవరి 2 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని చీఫ్ ఎగ్జామినర్ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ తెలిపారు.

గుం'టూరు' వచ్చిన ప్రపంచ పర్యాటకురాలు



ఇటలీ టూరిస్ట్ ఎలీనా ఎగ్జీనా

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ పర్యటనలో ఉన్న ఇటలీ దేశస్తురాలు ఎలీనా ఎగ్జీనా సోమవారం గుంటూరు నగరానికి వచ్చారు. గత మూడున్నరేళ్లుగా బైక్‌పై 28 దేశాలను సందర్శించిన ఆమె ప్రస్తుతం భారతదేశంలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా చెన్నై నుంచి వైజాగ్ వెళ్తూ మార్గ మధ్యలో గుంటూరు పండరీపురంలోని పులుగు దీపక్ నీట్, జేఈఈ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో మమేకమై మహిళా సాధికారతపై మాట్లాడారు. విద్యార్థినులు విద్యావంతులుగా ఆకాశమే హద్దుగా ఎదగాలని సూచించారు. తన పర్యటన విశేషాలను వివరిస్తూ బైక్‌పై మూడున్నరేళ్ల క్రితం మొదలైన తన ప్రపంచ యాత్ర ఇప్పటికి 28 దేశాల్లో ఎక్కడా ఒక్క హోటల్‌లో బస చేయకుండా, నిరంతరం కొనసాగడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. విభిన్న సంస్కృతులు, భిన్నమైన ప్రదేశాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు. ఎలీనాను సత్కరించిన శిక్షణా కేంద్ర నిర్వాహకుడు పులుగు దీపక్ భారతదేశ గొప్పతనాన్ని వివరించే స్పేస్ సైన్స్ పుస్తకాన్ని బహూకరించారు. గుంటూరులో తనకు లభించిన ఆదరణ, ఆత్మీయ స్వాగతంపై ఎలీనా ఆనందాన్ని వ్యక్తం చేశారు.



ఇటలీ దేశస్తురాలు ఎలీనా ఎగ్జీనాకు స్పేస్ సైన్స్ పుస్తకాన్ని బహూకరిస్తున్న పులుగు దీపక్

స్పందన ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

- విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్


బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్‌: స్పందన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 41 మంది హాజరై తమ సమస్యలను ఎస్పీ వకుల్ జిందాల్‌కు వివరించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్న ఎస్పీ వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలతో నేరుగా మాట్లాడారు. స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి చట్టప్రకారం పరిష్కారం చూపాలన్నారు. నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. స్పందన సమస్యలపై మీరు తీసుకున్న చర్యల నివేదికను ఎప్పటికప్పుడు పోలీసు ప్రధాన కార్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫెన్సింగ్, సైక్లింగ్ జట్ల ఎంపిక


జిల్లాస్థాయి ఫెన్సింగ్, సైక్లింగ్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు.

కర్లపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఫెన్సింగ్, సైక్లింగ్ జట్లకు ఎంపిక పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఏపీ శాప్ ప్రతినిధులు కనకారావు, సంగీతరావు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి గుంటూరు జిల్లా ఫెన్సింగ్ జట్లకు, సైక్లింగ్ జట్లకు అండర్-14, అండర్-17 విభాగాలలో జిల్లా పరిధిలోని 26 పాఠశాలల నుంచి బాలబాలికలు హాజరయ్యారని తెలిపారు. ఫెన్సింగ్ పోటీలలో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారిని అండర్-14, అండర్-17 బాలుర విభాగాలలో 12మంది చొప్పున 24మందిని బాలికల విభాగంలో 24మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామని తెలిపారు. సైక్లింగ్ పోటీలలో అండర్-14, అండర్-17 బాలుర విభాగాలలో నలుగురు చొప్పున 8మందిని, బాలికల విభాగంలో 8మందిని ఎంపికచేశామని తెలిపారు. ఈనెల 26వ తేదీన కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయిలో జరిగే ఫెన్సింగ్, సైక్లింగ్ పోటీలలో క్రీడాకారులు ఆడతారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ పరిశీలకులు బి.సుబ్బారెడ్డి, పీఈటీ ఎం.గోపి పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

- పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పెట్టుకోవాలి
- కన్వీనర్ల సమావేశంలో రీజనల్ కో ఆర్డినేటర్ భూమన కరుణాకరరెడ్డి


మాట్లాడుతున్న రీజనల్ కోఆర్డినేటర్ భూమన కరుణాకరరెడ్డి, వేదికపై పార్టీ జిల్లా అధ్యక్షుడు మోపిదేవి

సాక్షి,ప్రతినిధి, బాపట్ల: తన రెక్కల కష్టం మీద పార్టీని అధికారంలోకి తెచ్చిన ధీశాలి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. సోమవారం బాపట్లలోని తాలుకా రైస్ మిలర్స్ అసోషియేషన్ హాలులో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బాపట్ల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. భూమన మాట్లాడుతూ అందరూ...సీఎం ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా పని చేయాలన్నారు. ప్రతికార్యకర్త ఆయన అడుగు జాడల్లో సైనికుల్లా నడిచి పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. కనివినీ ఎరుగని రీతిలో పేదలకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. మీ అభ్యర్థిని గెలిపించుకోవడమే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల వారికి మంచి జరుగుతుందన్నారు. సామాజిక న్యాయం వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే చూస్తున్నామని మరో కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 77 శాతం మేర పదవులు కట్టబెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిం దన్నారు. నలుగురు బీసీలకు రాజ్యసభ స్థానాలు ఇచ్చారన్నారు. ఇంతకు మించి సామాజిక న్యాయం ఎక్కడ ఉంటుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఏ ముఖ్యమంత్రి చేపట్టనన్ని సంక్షేమ కార్యక్రమాలు వైఎస్ జగన్ అమలు చేస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికీ రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి జరుగుతుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకం కావాలన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ గడిచిన మూడున్నర సంవత్సరాల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. గడప గడపకు వెళ్లినపుడు ప్రజలు చూపిస్తున్న ఆదరణ చూస్తే ఈ విషయం తేటతెల్లమవుతందన్నారు. ప్రతిఒక్కరూ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ నిర్ణయాలను జనంలోకి తీసుకెళ్ళాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బాపట్ల నుండి అత్యధిక మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గం కోఆర్డినేటర్ బ్రాహ్మరెడ్డి, కన్వీనర్లతోపాటు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలసిన భూమన, బీద

మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డిను వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు భూమన కరుణాకరరెడ్డి, బీద మస్తాన్ రావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు గజ్జల బ్రహ్మారెడ్డిలు కలిశారు. సోమవారం బాపట్లకు చేరుకున్న ఇరువురు నేతలు పట్టణంలోని గాదె వెంకటరెడ్డి నివాసంలో ఆయనను, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డిలను కలిశారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే విషయంపై కొద్దిసేపు చర్చించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ మోదుగుల బసవపున్నారెడ్డి, కళ్లం హరినాథ్‌రెడ్డిలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు



బాపట్లఅర్బన్‌: జిల్లా స్థాయి హాకీ జట్టు ఎంపికలు స్థానిక జమ్ములపాలెం హైస్కూలులో సోమవారం జరిగాయి. పోటీల్లో విజేతలు ఈనెల 28నుంచి 30వ తేదీ వరకు యలమంచిలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఈ జట్టు పాల్గొననుంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో బి.చైతన్యకృష్ణసాయి, యాజలి ఇషిత, బాలకృష్ణవేణి, ఉమామాధవి, గవిని రేఖ, కొమ్మబోయిన జోరీ, రాయపూడి సరోజినీ, యామిని శ్రీనాగలక్ష్మీ, దివ్య, గిరిద్వారాక, రెబ్బకా, రాజేశ్వరీ, ప్రత్యుషా, పూర్ణిమ, దేవరపల్లి వెన్నిల, బోయిన సునైనా ఉన్నారు.

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

రీజనల్ కోఆర్డినేటర్లు బీద మస్తాన్‌రావు, భూమన


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి, వేదికపై భూమన, బీద, కరణ, సునీత

చీరాల: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, ప్రజల ఆశీస్సులతో మళ్లీ విజయం సాధిస్తామని పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ బీద మస్తాన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం వేటపాలెం మండలం రామాపురం సీబీడ్జ్ రిసార్ట్‌లో నియోజకవర్గ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. మస్తాన్‌రావు మాట్లాడుతూ అందరూ కలిసిమెలసి పనిచేసి పార్టీ గెలుపునకు కృషిచేయాలని సూచించారు. చీరాల నియోజకవర్గం పార్టీ అభ్యర్థిగా కరణం వెంకటేష్ పోటీ చేస్తారని తెలిపారు. పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లా కోర్డినేటర్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ 175కు175 సీట్లు గెలుపొంది తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ పార్టీ ప్రకటించిన అభ్యర్థులను గెలిపించుకోవడానికి అందరు కృషిచేయాలన్నారు. అంతకు ముందు దింగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎంపీ చిమటా సాంబు, నియోజక ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి


డొక్కు రాధ (ఫైల్)

కొల్లూరు: కొల్లూరు శివారు యాదవపాలెంలో ఆదివారం రాత్రి వివాహిత అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. పోలీసులు, మృతురాలి తల్లిదండ్రుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా నాగాయలంక మండలం పెదకమ్మవారిపాలెంకు చెందిన ఆరేవరపు కృష్ణారావు కుమార్తె రాధ (24)ను 2018లో యాదవపాలెంకు చెందిన డొక్కు కోటేశ్వరరావుకు ఇచ్చి వివాహం జరిపించారు. ఏడాదికాలంపాటు కాపురం సజావుగా సాగింది. రాధకు సంతానం కలగకపోవడంతో కలతలకు దారితీసింది. అప్పట్నుంచి భర్త కోటేశ్వరరావుతోపాటు, అత్త శివపార్వంతి, ఆడపడుచు కొలుసు తిరుపతమ్మలు మానసికంగా వేధింపులకు గురిచేయడం, శారీరకంగా హింసిస్తుండటంతో పుట్టింటికి వెళ్లింది. తల్లిదండ్రులు ఆమెకు సర్దిచెప్పి కాపురానికి పంపుతూ వచ్చారు. సంక్రాంతి పండుగకు ఆమె పుట్టింటికి వెళ్లిన అనంతరం, రూ.50 వేలు దొంగిలించుకెళ్లిందని అత్తింటి వారు ప్రచారం చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న మృతురాలు ఈనెల 20న తిరిగి వచ్చింది. అదేరోజు సాయంత్రం నగదు విషయమై మృతురాలు రాధ, భర్త, అత్త, ఆడపడుచుల మధ్య గొడవ జరగడంతో భర్త, అత్త, ఆడపడుచులు ఆమెపై దాడి చేసి రాళ్లతో కొట్టడంతో తలకు గాయమైంది. తమ కుమార్తెపై దాడి చేసిన విషయం ఫోన్ ద్వారా తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు శనివారం యాదవపాలెం చేరుకుని భార్యాభర్తల మధ్య సర్దుబాటు చేసి వెళ్లిపోయారు. ఆదివారం రాత్రి రాధ తల్లిదండ్రులకు ఫోన్ చేసిన కోటేశ్వరరావు ఫ్యాన్‌కు ఉరివేసుకుని మీ అమ్మాయి చనిపోయిందని తెలపడంతో హుటాహుటిన యాదవపాలెం చేరుకున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు రాధ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి తల్లి సావిత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ కుమార్తెను అత్తింటివారే చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కొల్లూరు ఎస్‌ఐ శామ్యూల్‌రాజీవ్‌కుమార్ తెలిపారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ శిక్షణ ముగింపు


పురుషుల కబడ్డీ జట్టుతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

చినగంజాం: కబడ్డీ జట్టు పోటీలో గెలిచి విజయంతో తిరిగి రావాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుర్రా భాస్కరరావు అన్నారు. స్థానిక ఎంఎస్‌ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ జట్టు శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం జిల్లా అంకుపాలెం అనకాపల్లిలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించే 70వ ఆంధ్ర రాష్ట్ర స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరపున పురుషుల జట్టు పాల్గొంటుందన్నారు. గత వారం రోజులుగా ఎంఎస్‌ఆర్ కాలేజీ ఆవరణలో జట్టుకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. టోర్నమెంట్‌కు జట్టు బయలుదేరుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని క్రీడాకారులకు అవగాహన కల్పిస్తూ వారిలో క్రీడా స్ఫూర్తిని నింపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చంద్రమోహనరెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీగిరి రంగారావు, ట్రజరర్ రమేష్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు దేశం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా పురుషుల జట్టు..
పీ బాలకృష్ణారెడ్డి (కెప్టెన్), కే శ్రీకాంత్, కే హరిప్రసాద్, జీ లక్ష్మారెడ్డి, జీ సమరసింహారెడ్డి, కే వెంకటేష్, జీ రాము, జీ లక్ష్మణ్, జీ బాలాజీ, జీ మల్లికార్జున, ఏ మంత్రునాయక్, పాపారావు, ఎం గిరిబాబు (కోచ్), బీ నాగాంజనేయులు (మేనేజర్).

బీపీ మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

బాపట్ల: బీపీ మండల్ కమిషన్ సిఫార్సులు కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బాపట్ల పట్టణంలోని బెస్తపాలెంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల సామాజిక, రాజకీయ, సంక్షేమ సమగ్రాభివృద్ధికి ఒక కమిషన్ వేస్తే.. ఆ సిఫార్సులను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదన్నారు. ఫిబ్రవరి 12న గుంటూరులో బీపీ మండల్ విగ్రహావిష్కరణ జరుగుతుందని.. జాతీయ స్థాయిలో బీసీ నేతలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్రధానకార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఒంగోలు ఎడ్ల బలప్రదర్శన పోటీలు

- హాజరైన పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎంపీ లావు, ఎమ్మెల్యే గోపిరెడ్డి
- మొదటిరోజు విజేతలకు బహుమతులు అందజేత


ఎద్దుల యజమానికి షీల్డు, గిఫ్ట్ ప్యాక్ అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎంపీ లావు, ఏమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట డీఎస్‌ఏ స్టేడియంలో గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్ ఒంగోలు జాతి వృషభరాజముల బండ లాగుడు బలప్రదర్శన పోటీలు సోమవారానికి రెండోరోజుకు చేరాయి. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆదివారం మొదటిరోజు నిర్వహించిన పాలపళ్ల విభాగంలో విజేతలైన వారికి నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో మొదటి విజేతగా ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన వల్లభనేని మోహనరావు ఎడ్ల జత గెలుపొందగా, రెండో బహుమతిని నరసరావుపేట మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన మాదనబోయిన పోతురాజుయాదవ్ ఎడ్లు, మూడో బహుమతిని నాదెండ్లకు చెందిన నలమోతు వేణుగోపాలరావు ఎడ్లు గెల్చుకున్నాయి. ఈ విధంగా హాజరైన 28ఎడ్ల జతల్లో పదింటికి అవి నిర్ణయించిన సమయంలో బండలాగిన దూరాన్ని బట్టి బహుమతులను అందజేశారు. నిర్వాహక కమిటీ సభ్యులు చల్లానారపరెడ్డి, పాలిమేర వెంకటరెడ్డి, మూరే రవీంద్ర, పానుగోటి వెంకటరావు, కనకా పుల్లారెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, వంపుగుడిజాన్, గాడిపర్తి సీతయ్య పోటీలను పర్యవేక్షించగా, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి రెఫరీలుగాను, వ్యాఖ్యాతగా సూరపునేని రాధాకృష్ణ వ్యవహరించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం పొడిగింపుపై హర్షం

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పదేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ మేడిద బాబూరావు సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. 2013లో సబ్ ప్లాన్ చట్టం పదేళ్ల కాలపరిమితితో అమలులోకి వచ్చిందని చెప్పారు. 2023తో గడువు ముగుస్తుండటంతో ప్రభుత్వం ఆ చట్టాన్ని పునరుద్ధరిస్తూ జీఓ జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేసేందుకు ప్రతి జిల్లాకు నోడల్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేసి నిధులను అర్హులైన ఎస్సీ, ఎస్టీ ఆదివాసీలకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఐజక్ విల్సన్, ఉపాధ్యక్షులు వై.యోహాన్, ఎన్.నాగేశ్వరరావు, ఎంపీ రత్నం, మనోజ్, సుశీల్‌కుమార్ ఉన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో..
నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం పొడిగింపుపై మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. చుట్టుగుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల పక్షపాతిగా వారి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సబ్ ప్లాన్ చట్టాన్ని మరో పదేళ్లు పొడిగింపుపై హర్షం వ్యక్తం చేశారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం
తాడేపల్లిరూరల్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పదేళ్లు పొడిగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానిక క్రిస్టియన్‌పేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాల వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కనకారావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తండ్రి బాటలో నడుస్తూ పేద ప్రజల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు కోట్లాది రూపాయలు నవరత్నాల రూపంలో అందజేస్తూ వారికి ఆత్మబంధువుగా ఉన్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఈదులమూడి డేవిడ్ రాజు, మంగళగిరి నియోజకవర్గనాయకులు ముదిగొండ ప్రకాష్, వైఎస్సార్ సీపీ నాయకులు బుర్రముక్కు వేణుగోపాలరెడ్డి, బాలసాని అనీల్, చిలుకోటి మధు, పండు, అమృతరావు, అంబారావు, ఎన్.ప్రభాకర్, అశోక్, నాగబాబు, చిన్నబాబు, ఎం.విజయ్, డేవిడ్, సుధాకర్ పాల్గొన్నారు.